క్లుప్తంగా

నేడు కరెంట్‌ ఉండని ప్రాంతాలు

సైదాబాద్‌: చెట్లకొమ్మల తొలగింపు, విద్యుత్‌ మరమ్మతు పనుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌గఢ్‌ డీఈ విష్ణు వర్ధన్‌రెడ్డి తెలిపారు.

ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు..

రైల్వే ట్రాక్‌, పోస్ట్‌ ఆఫీస్‌, ముంతాజ్‌ఖాన్‌, రైల్వే ఓపెన్‌ ల్యాండ్‌, తలా మజీద్‌, రహ్మత్‌నగర్‌, జీఎం నగర్‌, కింగ్‌ హౌజ్‌ హోటల్‌, దోభీఘాట్‌, లంబాడి బస్తీ, ఒవైసీ హాస్పిటల్‌ మెయిన్‌రోడ్‌, జఫారియా మజీద్‌, ఒవైసీ హాస్పిటల్‌, ఎంసీ కాలనీ, రామాలయం, ఎస్‌బీహెచ్‌ కాలనీ, మలక్‌పేట పీఎస్‌, మహిళా మండలి, బీ బ్లాక్‌, హమాలి బస్తీ, వెంకటాద్రినగర్‌, గౌసియా మజీద్‌, 7 టెంపుల్‌ న్యూ, అజంపురా మీటర్‌, అజంపురా కాంటా, వార్డ్‌ ఆఫీస్‌, డీసీ పటేల్‌ కంపెనీ, మిలాద్‌ గల్లీ, చంచల్‌గూడ న్యూ రోడ్‌, డైమండ్‌ హోటల్‌, అర్షాద్‌ హోటల్‌, వైట్‌హౌజ్‌, రోషన్‌ డైరీ, చంచలగూడ కల్లా పరిసర ప్రాంతాలు.

మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 వరకు..

టీవీ స్టేషన్‌, మలక్‌పేట, డబీర్‌పురా బ్రిడ్జ్‌, షా కాలనీ, ముంతాజ కాలనీ, గ్రేవ్‌ యార్డ్‌, డైనమిక్‌ స్కూల్‌, మినాజ్‌ స్కూల్‌, శంకర్‌నగర్‌, విద్యానగర్‌, శంకర్‌నగర్‌ ఓల్డ్‌, కిసాన్‌ దొడ్డి, సరోజి నగర్‌, ఎంసీహెచ్‌ కాలనీ, రేస్‌కోర్స్‌ రోడ్‌, లైబ్రరీ పీటీ, వాణీ స్కూల్‌, రైల్వే ట్రాక్‌, దో నెంబర్‌గల్లీ, ఫతేష్‌ సిద్దీఖ్‌ మజీద్‌, నిజాం హోటల్‌, గౌసియా స్కూల్‌, ఖాన్‌ నగర్‌ నాలా, ఫరా హోటల్‌, అఫూ పీటీ, హిదాయ్‌తా ఫంక్షన్‌హాల్‌, అమన్‌ నగర్‌, దర్గా, రియాసత్‌నగర్‌, ఇందిరా నగర్‌, హబీబ్‌ నగర్‌, మొయిన్‌ బాగ్‌, జవహర్‌ కాలనీ, ఇంద్రానగర్‌, రవూఫ్‌ నగర్‌, రాజనర్సింహ నగర్‌ కాలనీ, గౌస్‌నగర్‌, ఇందిరా నగర్‌, మిధాని డిపో, హయత్‌ హోటల్‌, పిసల్‌బండ రోడ్‌ పరిసర ప్రాంతాల్లో విద్యుత్‌ ఉండదన్నారు.

పెండింగ్‌ పనులు త్వరగా పూర్తి చేయాలి



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బలాల

చాదర్‌ఘాట్‌: పాత మలక్‌పేట డివిజన్‌లో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు వెంటనే పూర్తి చేయాలని మలక్‌పేట ఎమ్మెల్యే బలాల ఆదేశించారు. మంగళవారం ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి డివిజన్‌లో పర్యటించి పనులల్లో జాప్యంపై ఆరా తీశారు. వర్షాలు ప్రారంభం కాకముందే పనులన్నీ పూర్తి చేయాలన్నారు. ప్రధానంగా డ్రైనేజీ, మ్యాన్‌హోళ్లు పొంగకుండా వరదనీటి కాలువల్లో పూడిక తీయాలని ఆదేశించారు.

పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సు

నాగోలు: ఆర్టీసీ బండ్లగూడ డిపో నుండి 5 పుణ్‌ క్షేత్రాల దర్శనానికి బస్సు ఉంటుందని మేనేజర్‌ వెంకటేశం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న ఉదయం 6 గంటలకు బండ్లగూడ, ఉప్పల్‌ చౌరస్తా నుంచి బయలుదేరి రామాపురం, శ్రీరంగపురం, జటప్రోలు, సోమశిల, సంగమేశ్వరం దర్శనం అనంతరం తిరిగి హైదరాబాద్‌కు రాత్రి 10 గంటలకు చేరుకుంటుకుందని ఇతర వివరాలకు 9959224058, 9701059484 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మలక్‌పేట: తెలంగాణ వీరభద్రీయ (వీరముష్టి) సంఘం కేంద్ర కమిటీ సర్వసభ్య సమావేశం కేంద్ర కమిటీ అధ్యక్షుడు కాటపల్లి వీరస్వామి అధ్యక్షతన మూసారంబాగ్‌లోని కేంద్ర కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశానికి జాతీయ అధ్యక్షుడు కాటపల్లి రాజేశ్వర్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పొన్నాల నరహరి ఎన్నికల చైర్మన్‌గా వ్యవహరించగా జిల్లా, స్థానిక సంఘాల ప్రతినిధులతో కూడిన ఎన్నికల కమిటీ సమన్వయంతో నూతన కేంద్ర సంఘం కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. అధ్యక్షుడిగా కొండయ్య, వర్కింగ్‌ ప్రెసిడెంట్లుగా భిక్షపతి, పోచయ్య, ప్రధానకార్యదర్శి శ్రీనివాస్‌, కోశాధికారి రవికుమార్‌ ఎన్నికయ్యారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్‌: సరూర్‌నగర్‌/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు..

టమాటా రూ.21, వంకాయ రూ.23, బెండ రూ.45, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.31, కాలిఫ్లవర్‌ రూ.23, క్యాబేజీ రూ.19, క్యారెట్‌ రూ.40, దొండ రూ.28, ఆలుగడ్డ రూ.25, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ.11, పొట్లకాయ రూ.23, అరటికాయ రూ.11, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.28, మునగ రూ.85, కందగడ్డ రూ.45, బీట్‌రూట్‌ రూ.25, కీర రూ.40, బీన్స్‌ రూ.85, క్యాప్సికమ్‌ రూ.67.

ఈ ధరలు బుధవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

తొలగిన వ్యర్థాలు..

శుభ్రమైన శౌచాలయాలు



మంగళవారం సాక్షిలో ప్రచురితమైన కథనం

సాక్షి ఎఫెక్ట్‌..

హస్తినాపురం: ఎల్‌బీనగర్‌ సర్కిల్‌ పరిధిలోని హస్తినాపురం, వనస్థలిపురం, లింగోజిగూడ, చంపాపేట డివిజన్ల పరిధిలోని చాలా ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా జరగకపోవడంతో ఆయా ప్రాంతాలన్నీ దుర్గంధంగా మారాయి. వనస్థలిపురం పోలీస్‌ స్టేషన్‌ వెనకాల ఉన్న పార్కు ముందు ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు పూర్తిగా శిథిలావస్థకు చేరి కంపు కొడుతున్నాయి. ఆయా సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులతో స్థానికులు మొర పెట్టుకున్నా పట్టించుకోలేదు. ఈ సమస్యపై మంగవారం సాక్షిలో 'పడకేసిన పారిశుద్ధ్యం.. అధికారుల చోద్యం' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఎల్‌బీనగర్‌ సర్కిల్‌ ఎఎంహెచ్‌ఓ నాగేష్‌ స్పందించారు. ఆయా ప్రాంతాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగింపజేసి మరుగుదొడ్లను శుభ్రం చేసేలా చర్యలు చేపట్టారు. నెలల తరబడి వేధిస్తున్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన సాక్షికి ఆయా ప్రాంతాల వారు కృతజ్ఞతలు తెలిపారు.



వ్యర్థాలు తొలగించిన తర్వాత ఇలా..



శుభ్రమైన మరుగుదొడ్డి

ఆ చట్టాన్ని రద్దు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న జేఏసీ నేతలు

ఎల్‌బీనగర్‌: కేంద్ర ప్రభుత్వం పెన్షన్‌దారుల బెనిఫిట్స్‌కు భంగం కలిగేలా పార్లమెంట్‌లో చట్ట సవరణ చేసిందని, ఆ చట్టాన్ని రద్దు చేయాలని తెలంగాణ ప్రభుత్వ పెన్షన్‌దారుల సంయుక్త కార్యచరణ సమితి రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు సోమిరెడ్డి డిమాండ్‌ చేశారు. ఈ మేరకు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ సీ.నారాయణరెడ్డికి మంగళవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సోమిరెడ్డి మాట్లాడుతూ.. పెన్షన్‌దారులకు వ్యతిరేకంగా చేసిన చట్టాన్ని రద్దు చేయాలని ప్రధాని నరేంద్రమోదీకి పెన్షన్‌దారుల వినతి చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపికృష్ణ, రాంరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, రాజు పాల్గొన్నారు.

గుడి నిర్మాణ పనులు ప్రారంభం



పనుల ప్రారంభోత్సవం భాగ్యలక్ష్మి

మలక్‌పేట: బోనాల పండుగ వరకు గుడి నిర్మాణం పూర్తి చేసేలా చూస్తామని మూసారంబాగ్‌ కార్పొరేటర్‌ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. డివిజన్‌ పరిధిలోని శాలివాహననగర్‌ వాంబే కాలనీలో దుర్గమ్మ, ఎల్లమ్మ, మైసమ్మ గుడి నిర్మాణ పనులు మంగళవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. గతంలో గుడి నిర్మాణానికి శంకుస్థాపన చేసినా కొన్ని కారణాలతో పనులు ముందుకు సాగలేదన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి గుడి నిర్మాణానికి నిధులు మంజూరు చేయించి పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ను స్థానికులు సత్కరించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ శరత్‌, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ సత్తిరెడ్డి, కాలనీవాసులు రాంచందర్‌, ప్రభాకర్‌, రమేష్‌, నవీన్‌, బీజేపీ నాయకులు సురేందర్‌, దేవేందర్‌, దినేష్‌, ప్రవీణ్‌, పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు వినతి

మలక్‌పేట: ఆషాఢమాసం బోనాలకు అమ్మవారి గుడిలకు నిధులు మంజూరు చేయాలని మూసారంబాగ్‌ కార్పొరేటర్‌ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌ రెడ్డి మంగళవారం ఎండోమెంట్‌ అసిస్టెంట్‌ కమిషనర్‌ శేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..తెలంగాణలో అత్యంత వైభవోపేతంగా జరుపుకునే బోనాల ఉత్సవాలకు నిధులు పెంచాలని కోరారు.

అఘాయిత్యాల అడ్డుకట్టలో ప్రభుత్వాలు విఫలం



సమావేశంలో పాల్గొన్న షైమీద

నాగోలు: మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడంలో కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్‌ ప్రభుత్వం విఫలమయ్యాయని భారత జాతీయ మహిళ సమాఖ్య ఎన్‌ఎఫ్‌ఐడబ్ల్యూయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి షైమీద అన్నారు. కమలమ్మ అధ్యక్షతన న్యూ నాగోలులోని ఎస్‌ఏ డాంగే భవన్‌లో మంగళవారం నిర్వహించిన సరూర్‌నగర్‌ మండల 16వ మహాసభలో షైమీద పాల్గొని మాట్లాడారు. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా ఉద్యోగస్తులు కూలి, ఇళ్లలో పని చేసే మహిళలు యజమానుల ఒత్తిడికి గురవుతూ నానా ఇబ్బందులు పడుతున్నారని పనికి వెళ్లిన దగ్గర మహిళలకు వేధింపులు ఏమాత్రం తగ్గడం లేదని ఆరోపించారు. ఇటీవల మహిళలపై అఘాయిత్యాలు, హత్యలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బాతరాజు నరసింహ, కందుల సుధాకర్‌ పాల్గొన్నారు. అనంతరం సమాఖ్య సరూర్‌నగర్‌ మండల అధ్యక్షురాలిగా సుమలత, ప్రధాన కార్యదర్శిగా కమలమ్మతో పాటు 11 మందితో కమిటీని ఎన్నుకున్నారు.

చింతలకుంట ఫ్లైఓవర్‌ను ఎలివేటెడ్‌ ఫ్లైఓవర్‌గా మార్చాలి



రహదారుల చీఫ్‌ ఇంజినీర్‌తో చర్చిస్తున్న బీజేపీ నేతలు

ఎల్‌బీనగర్‌: చింతలకుంట నుంచి ఆటోనగర్‌ వరకు నిర్మించే ఫ్లైఓవర్‌ ఎలివేటెడ్‌ ఫ్లై ఓవర్‌గా మార్చాలని రాష్ట్ర రోడ్లు రహదారుల ఇంజినీర్‌ ఇన్‌ చీఫ్‌ కృష్ణప్రసాద్‌ను కలిసి చర్చించామని బీజేపీ ఎల్‌బీనగర్‌ ఇన్‌చార్జి సామ రంగారెడ్డి అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చింతలకుంట నుంచి హయత్‌నగర్‌ రేడియో స్టేషన్‌ వరకు జాతీయ రహదారిపై నిర్మించే ఫ్లై ఓవర్లు మట్టితో కాకుండా ఎలివేటెడ్‌గా నిర్మించాలని స్థానికుల విజ్ఞప్తి మేరకు మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ కేంద్ర రహదారుల శాఖ మంత్రి నితిన్‌ గడ్కారిని కలిసి విన్నవించామన్నారు. పలుమార్లు చర్చల అనంతరం హయత్‌నగర్‌ ఫ్లై ఓవర్‌ ఎలివేటెడ్‌గా, చింతలకుంట ఫ్లై ఓవర్‌ మట్టి ఫ్లైఓవర్లుగా అనుమతులు వచ్చాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కొప్పుల నర్సింహారెడ్డి, కళ్లెం నవజీవన్‌రెడ్డి, నాయకులు గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, నూతి శ్రీనివాసరావు, స్థానికులు పోచబోయిన కృష్ణయాదవ్‌, బొమ్మిడి రాంగారెడ్డి పాల్గొన్నారు.

కొనసా..గుతున్న దరఖాస్తుల పరిశీలన



మాట్లాడుతున్న రాజేందర్‌

చాదర్‌ఘాట్‌: దివ్యాంగుల కోసం గత ఆరు నెలల క్రితం వికలాంగుల సంక్షేమ, వయోవృద్ధుల, ట్రాన్స్‌జెండర్స్‌ శాఖ ఆర్థిక పునరావాసం పథకానికి దరఖాస్తులు స్వీకరించారు. నాటి నుంచి ఈ దరఖాస్తుల్లో ఎలాంటి పురోగతి లేకుండా పోయింది.ఈ విషయమై పలుమార్లు దరఖాస్తుదారులు ఆయా మండల కార్యాలయాలకు వెళ్లి ఆరా తీయగా స్పష్టమైన సమాధానం లేకపోవడంతో అసహనానికి గురవుతున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం మలక్‌పేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హైదరాబాద్‌ వికలాంగుల సంక్షేమ శాఖ అడిషనల్‌ డైరెక్టర్‌ రాజేందర్‌ వివరాలు వెల్లడించారు. హైదరాబాద్‌ జిల్లాలోని 16 మండలాల్లో 3052 దరఖాస్తులు వచ్చాయని ఈ దరఖాస్తుల నుంచి మండలానికి ఒకరు చొప్పున ఎంపిక చేస్తారన్నారు. ఎంపికైన దరఖాస్తుదారునికి రూ. 50 వేలు పూర్తి సబ్సిడీ సంక్షేమ శాఖ అందిస్తుందన్నారు. జిల్లా అధికారులు వివిధ పనులపై దృష్టి పెట్టడం, అదే విధంగా రాజీవ్‌ యువ వికాసం దరఖాస్తుల పరిశీలనకు వెళ్లడంతో దరఖాస్తుల పరిశీలన ఆలస్యం అయినట్లు అధికారులు తెలిపారు. ఆగస్టు చివరి వారంలో అర్హుల జాబితా పెడుతామన్నారు.

మండలం	-	దరఖాస్తులు
1. అంబర్‌పేట	-	198
2. అమీర్‌పేట	-	24
3. ఆసిఫ్‌నగర్‌	-	497
4. బండ్లగూడ	-	447
5. బహదూర్‌పురా	-	496
6. చార్మినార్‌	-	259
7. గోల్కొండ	-	81
8. హిమాయత్‌నగర్‌	-	43
9. ఖైరతాబాద్‌	-	157
10. మారేడ్‌పల్లి	-	78
11 ముషీరాబాద్‌	-	160
12. నాంపల్లి	-	162
13. సైదాబాద్‌	-	201
14. సికింద్రాబాద్‌	-	100
15. షేక్‌పేట	-	109
16. తిరుమలగిరి	-	40

నేడు మార్కెట్‌కు సెలవు

చాదర్‌ఘాట్‌: మలక్‌పేటలోని హైదరాబాద్‌ వ్యవసాయ మార్కెట్‌కు అమావాస్య నేపథ్యంలో బుధవారం(నేడు) సెలవు ఉంటుందని ఎస్‌జీఎస్‌ చిలుక నర్సింహారెడ్డి తెలిపారు.

యువతి అదృశ్యం



శ్రావణి

నాగోలు: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..జైపురికాలనీకి చెందిన శ్రావణి(26), ఈ నెల 23న మధ్యాహ్నం ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు ఫోన్‌ చేయగా స్విచ్ఛాఫ్‌ రావడంతో తండ్రి శ్రీనివాస్‌ మంగళవారం నాగోలు పోలీస్‌ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కత్తితో దాడి.. ఒకరికి తీవ్రగాయాలు

చైతన్యపురి: ఒక వ్యక్తి ఆచూకి కోసం వచ్చి గొడవ పడి మరొ వ్యక్తిపై కత్తితో దాడి చేసిన ఘటన సరూర్‌నగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్‌ సైదిరెడ్డి వివరాల ప్రకారం.. సరూర్‌నగర్‌ తిరుమలనగర్‌ రోడ్‌నంబర్‌-8 లో తోపుడు బండిపై పండ్ల వ్యాపారం చేసే అభిషేక్‌ (17)తో పాటు మరికొందరు స్నేహితులు ఉంటున్నారు. ఆదివారం రాత్రి నిజాంపేటకు చెందిన నాగరాజు, జగదీష్‌ తిరుమలానగర్‌లోని వీరి రూమ్‌ వద్దకు వచ్చారు. ఇంతకు ముందు ఇక్కడ పనిచేసే భద్రు తన బైక్‌ తీసుకొచ్చాడు ఇప్పుడు ఎక్కడ ఉన్నాడని అడిగారు. భద్రు జాడ కోసం అతని సోదరుడిని వెంట తీసుకొచ్చారు. తమకు తెలియదు అని చెప్పగా ఆవేశంతో అభిషేక్‌తో పాటు రూమ్‌లోని మిగతా వారిపై దాడి చేసి వెళ్లారు. భద్రు గురించి సమాచారం చెప్పలేదనే కోపంతో సోమవారం రాత్రి నాగరాజు, జగదీష్‌ మరో నలుగురుని వెంట పెట్టుకుని కర్రలు, కత్తితో వచ్చారు. రూమ్‌ బయట తోపుడు బండిపై నిద్రిస్తున్న అభిషేక్‌ను కత్తితో దాడి చేసి పరారయ్యారు. రక్తపు మడుగులో ఉన్న అభిషేక్‌ను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. బాధితుడి స్నేహితుడు నాగేశ్వర రావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెడు వ్యసనాలతో జీవితం నాశనం



మాట్లాడుతున్న ఏసీపీ సుధాకర్‌

చాంద్రాయణగుట్ట: విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని చాంద్రాయణగుట్ట ఏసీపీ సుధాకర్‌ సూచించారు. చాంద్రాయణగుట్టలోని ప్రభుత్వోన్నత పాఠశాల ఆవరణలో విద్యార్థులకు యాంటీ డ్రగ్స్‌, సైబర్‌ క్రైం నేరాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు జాగ్రత్తలు సూచించి సలహాలు చేశారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు సీహెచ్‌.నారాయణ, ఫిజికల్‌ డైరెక్టర్‌ వి.శ్రీను, అధ్యాపకులు సునీత, శ్రీనివాస్‌, సాయిబాబా, చాంద్రాయణగుట్ట ఇన్‌స్పెక్టర్‌ గోపి, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

సంతోష్‌నగర్‌: విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని సంతోష్‌నగర్‌ డివిజన్‌ ఏసీపీ ఠాకూర్‌ సుఖ్‌దేవ్‌ సింగ్‌ అన్నారు. సంతోష్‌నగర్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలోని యూనిక్‌ స్కూల్‌లో యాంటీ డ్రగ్స్‌పై విద్యార్థులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాదకద్రవ్యాల వల్ల జరిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో సంతోష్‌నగర్‌ ఇన్‌స్పెక్టర్‌ కె.సత్యనారాయణ, డీఐ జగన్‌ రెడ్డి, ఎస్సైలు రవి, నస్రీన్‌ బేగం తదితరులు పాల్గొన్నారు.

బాక్స్‌ డ్రైనేజీ లైన్‌ పనులు త్వరగా పూర్తి చేయాలి



పనులను పరిశీలిస్తున్న హేమంత్‌ కేశవ్‌ పాటిల్‌

నాగోలు: కాలనీ వాసులకు ఇబ్బందులు లేకుండా బాక్స్‌ డ్రైనేజీ లైన్‌ పనులు త్వరగా పూర్తి చేయాలని జోనల్‌ కమిషనర్‌ హేమంత్‌ కేశవ్‌ పాటిల్‌ సూచించారు. మంగళవారం ఆయన కొత్తపేట డివిజన్‌ కార్పొరేటర్‌ నాయికోటి పవన్‌కుమార్‌తో కలిసి సమతాపురికాలనీ, రాఘవేంద్రకాలనీల్లో పర్యటించారు. సమతపురి కాలనీ నాగోలు ఇన్నర్‌ రింగ్‌ రోడ్‌ నుంచి న్యూ నాగోల్‌ రోడ్‌ నెంబర్‌-10 వరకు చేపడుతున్న బాక్స్‌ డ్రైనేజీ లైన్‌ పనులు ఆయన పరిశీలించారు. సమతపురి కాలనీ లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు నెలకొంటున్నారని, సమతపూరి కాలనీ రోడ్‌ నెంబర్‌ 2,3,4 లో నూతన పైప్‌ లైన్లు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్‌ కోరగా నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్‌ డిప్యూటీ కమిషనర్‌ సుజాత, ఈఈ శ్రీనివాస్‌, డీఈ చందన, ఏఈ షరీఫ్‌, వర్క్‌ ఇన్‌స్పెక్టర్‌ వెంకటేశ్వర్లు, బుచ్చయ్య, కాలనీవాసులు శ్రీనాథ్‌, నాయకులు మంచి రాజేష్‌, సుందర్‌ నారాయణ, వెంకట్‌ రెడ్డి, విజయ గౌడ్‌ , లావణ్య, పింకీ సింగ్‌ పాల్గొన్నారు.

పుస్తకాల వితరణ



మాట్లాడుతున్న డాక్టర్‌ సూర్యప్రకాశ్‌

మలక్‌పేట: సగౌర చారిటబుల్‌ సొసైటీ వారు ప్రభుత్వ పాఠశాలలకు పుస్తకాల వితరణ చేశారు. మంగళవారం మలక్‌పేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాగ్‌మూసారిమో పాఠశాల, జీపీఎస్‌ శంకేశ్వర్‌బజార్‌, గడ్డిఅన్నారం పాఠశాలలకు గ్రంథాలయ పుస్తకాలు, టీచింగ్‌ లెర్నింగ్‌ మెటీరీయల్‌ అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ కోశాధికారి డాక్టర్‌ సూర్యప్రకాశ్‌, సభ్యులు పాపన్న మాట్లాడుతూ.. చదువుతోనే జీవితాలలో మార్పు వస్తుందని, బాగా చదువుకుని ప్రయోజకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. పాఠశాలకు ఏ అవసరమైన సొసైటీ సహయ సహకారాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వెంకటేష్‌, ఉపాధ్యాయులు సాంబశివరావు, సతీష్‌, ఉదయ్‌ కుమార్‌, జ్యోతి, నిర్మల పాల్గొన్నారు.

ఫీజుల దోపిడీ అరికట్టాలి'

నాంపల్లి: ప్రైవేట్‌ విశ్వవిద్యాలయాలు, ఇంజినీరింగ్‌ కళాశాలల్లో ఫీజుల దోపిడీని అరికట్టాలని పీడీఎస్‌యూ జాతీయ నాయకుడు మహేశ్‌, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొడపంగి నాగరాజు, గ్రేటర్‌ హైదరాబాద్‌ అధ్యక్ష, కార్యదర్శులు మంద నవీన్‌, కె.శ్రీనివాస్‌ కోరారు. ఉన్నత విద్యా మండలి వైస్‌ చైర్మన్‌ ప్రొఫెసర్‌ పురుషోత్తమ్‌కు మంగళవారం వినతి పత్రం అందజేశారు.

చొరవ ఎవరిదైనా సమస్య పరిష్కారం

స్టేటస్‌ కో ఎత్తివేతపై క్రెడిట్‌ మాదంటే మాదని కాంగ్రెస్‌, బీఆర్‌ఎస్‌ పోటాపోటీ

వనస్థలిపురం: వనస్థలిపురం కమలానగర్‌, ఆంధ్రకేసరినగర్‌ కాలనీలలో రిజిస్ట్రేషన్ల సమస్య రాజకీయ రంగు పులుముకుంది, ఈ కాలనీలలో దాదాపు 30, 40 సంవత్సరాలుగా ఇళ్లు కట్టుకుని ఉంటున్నారు. ఇటీవల కొందరు ప్రైవేటు వ్యక్తులు సాహెబ్‌నగర్‌ కలాన్‌ సర్వే నెం. 2 నుంచి 8 వరకు ఉన్న భూములు తమవి అంటూ కోర్టును ఆశ్రయించడంతో ఆ కాలనీలలో రిజిస్ట్రేషన్లు నిలిపివేస్తూ ఇబ్రహీంపట్నం ఆర్‌డీవో స్టేటస్‌ కో విధించారు. ఈ క్రమంలో ఆందోళన చెందిన కాలనీల ప్రజలు ఎల్‌బీనగర్‌ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్‌ మధుయాష్కీగౌడ్‌లకు సమస్య పరిష్కరించాలంటూ విజ్ఞప్తి చేయగా ఈ క్రమంలో ఆర్‌డీవోతో మాట్లాడి స్టేటస్‌ కో ఎత్తివేయించామని రెండు రోజుల క్రితం మధుయాష్కీగౌడ్‌ పత్రికా ప్రకటన చేయగా ఈ సమస్య పరిష్కారానికి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి కృషి చేశారని కొందరు పేర్కొంటున్నారు. ఈ క్రమంలో కాలనీల నాయకులు సోమవారం మధుయాష్కీగౌడ్‌, మంగళవారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని కలిసి సమస్య పరిష్కారానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు.

సబితారెడ్డిపై విమర్శలు సరికాదు

బీఆర్‌ఎస్‌ నేత రాఘవేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న నాయకులు

మహేశ్వరం: ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రోద్బలంలో రాజకీయంగా ఎదిగిన నేతలు ఆమెపైనే విమర్శలు చేయడం సరికాదని బీఆర్‌ఎస్‌ నాయకుడు మర్యాద రాఘవేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని మన్సాన్‌పల్లి చౌరస్తాలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఇటీవల కాంగ్రెస్‌ నుంచి సుమారు 200 మంది నాయకులు, కార్యకర్తలు బీఆర్‌ఎస్‌ పార్టీలోకి చేరారన్నారు. ఈ విషయం కొంతమందికి జీర్ణించుకోవడం లేదన్నారు. పార్టీకి వస్తున్న ఆదరణ చేసి ఓర్వలేక ఎమ్మెల్యే సబితారెడ్డిపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆమె మద్దతుతో ఎదిగిన నాయకులు సైతం మాట్లాడడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో నాయకులు జాన్‌రెడ్డి, రాజునాయక్‌, ఆంజనేయులుగౌడ్‌, బాల్‌రాజ్‌గౌడ్‌, శంకరయ్య, కృష్ణాగౌడ్‌, శ్రీనివాస్‌చారి, అశోక్‌గౌడ్‌, కుమార్‌గౌడ్‌, మహేశ్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉచితంగా డేటా ఇంజినీరింగ్‌ కోర్సు

అబిడ్స్‌: సత్యసాయి సేవా సంస్థ, సత్యసాయి స్కిల్‌ డెవలప్‌మెంట్‌ కార్యక్రమంలో భాగంగా నిరుద్యోగ యువతకు ఉచిత డేటా ఇంజినీరింగ్‌ కోర్సు శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2022–2025 మధ్య బీఎస్సీ, ఎంఎస్సీ, బీటెక్‌, ఎంటెక్‌, లేదా ఎంసీఏ పూర్తిచేసిన పట్టభద్రులు అర్హులని, ఎంపికైన అభ్యర్థులకు బేసిక్‌, అడ్వాన్స్‌డ్‌ పైథాన్‌, ఎస్‌.క్యూ.ఎల్‌, బీఐ టూల్స్‌తో పాటు సాఫ్ట్‌ స్కిల్‌లో 90 రోజుల పాటు శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని సత్యసాయి స్కిల్‌ సెంటర్‌లో ఆఫ్‌లైన్‌లో తరగతులు ఉంటాయని తెలిపారు. కోర్సు పూర్తయిన తర్వాత ప్లేస్‌మెంట్‌ కూడా ఉంటుందని, మరిన్ని వివరాలకు 90523 72023 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.